



# కరపత్రం

SINCE 2014

గురువారం సెప్టెంబర్ 18 2025 సంపుటి :0 సంచిక :331 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## మరింత ఉత్సాహంతో పనిచేస్తా..

## 'జనశక్తి'కి కృతజ్ఞతలు: ప్రధాని మోదీ

ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా దేశవిదేశాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే ధన్యవాదాలు తెలుపుతూ మోదీ ట్వీట్ చేశారు. 'జనశక్తికి కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' కలను సాకారం చేసే దిశగా మరింత ఉత్సాహం, అంకితభావంతో పనిచేయాలని సంకల్పించినట్లు తెలిపారు. తన పుట్టిన రోజు నేపథ్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైనవారిని అభినందించారు. పేజి 2లో ▶





# విద్యావిధానంలో సమూల మార్పులు

### పేదరిక నిర్మూల జరిగేలా ఉండాలి

### దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చి దిద్దండి

### అధికారులకు సిఎం రేవంత్ సూచన

విద్యావిధానంలో సమూల మార్పులు, ప్రక్షాలళనకు నిర్ణయం తీసుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యా విధానంలో మార్పులతో పాటు పేదరిక నిర్మూలన జరగాలని అన్నారు. అంతేగాకుండా తెలంగాణ విద్యావిధానం దేశానికి రోల్ మోడల్ కావాలని అన్నారు. తెలంగాణ నూతన విద్యా విధానంపై సిఎం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన జరగాలంటే విద్య ఒక్కటే మార్గం అని అంతర్జాతీయ స్థాయికి మన విద్యా విధానం సరితూగట్లేదని తెలియజేశారు. పేజి 2లో ▶



# పటేల్ చొరవతో హైదరాబాద్‌కు విముక్తి



### పాక్ అణుబెదరింపులకు లొంగేది లేదు

### ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా చాటాం

### మధ్యప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోడీ

నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పేజి 2లో ▶

తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా..

# పోరాటాల గడ్డ

» అదే పోరాట స్ఫూర్తితో కాంగ్రెస్ నియంతృత్వంపై పోరు

» తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఎగరేసిన కెటిఆర్



హైదరాబాద్,సెప్టెంబర్17

తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా.. పోరాటాల గడ్డ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దాం అన్నారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో తిరిగి తెలంగాణను సంక్షేమ బాటలో తీసుకెళ్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..

కొందరు విమోచనం అని, మరికొంత మంది విలీనం అని, ఇంకొంత మంది విద్రోహమని రకరకాలుగా అనవచ్చు గాక, కానీ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆనాడు లక్షలాది మంది పాల్గొని వేలాది మంది అసువులు భాసారు. ఆనాటి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి మనకు స్వేచ్ఛా వాయువులు వచ్చాయంటే ఆనాటి అమరవీరుల త్యాగాలు మనందరికి ఆదర్శం. 02



# అమరుల ఆశయాలను కొనసాగిస్తున్నాం

సిద్ధిపేటలో జెండా ఎగురేసిన మంత్రి పొన్నం

సిద్ధిపేట,సెప్టెంబర్17 : తెలంగాణ ఉద్యమం అనేది నీళ్ళు, నిధులు, నియామకాలు, ప్రతేక్య రాష్ట్రం కోసం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. 02

## గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన వారిపై నిందలు అన్యాయం - మంత్రి శ్రీధర్‌బాబు



02

# ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనది

### దాని స్ఫూర్తి ఆధారంగానే తెలంగాణ పోరాటం

### సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిది

» బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి తావులేకుండా పాలన

» విద్యారంగంలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నాం

» విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యానికి పెద్దపీట వేస్తున్నాం

» సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్న రైతు సంక్షేమ పథకాలు

» డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు

» పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహణ.. ఫలితాల వెల్లడి

» సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం

» కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు

» తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

» అమరుల స్థూపం వద్ద ఘనంగా నివాళి



2లో

# సంపాదకీయం

## బిహార్‌ను మోదీ మ్యాజిక్ ఆకట్టుకునేనా

'బిహార్‌లో చొరబడిన ప్రతి ఒక్కరూ వెళ్లిపోవాల్సిందే..' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం బిహార్‌లో పూర్ణియా జిల్లాలో మాట్లాడుతూ అన్నారు. బిహార్‌లో గత జనవరి నుంచి మోదీ ఏడవ పర్యటన ఇది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మోదీ అక్కడి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తన ఎన్నికల ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంటారు. బిహార్‌లో తన ప్రచారాన్ని ఏ దిశన మళ్లించబోతున్నారో ఇప్పటికే స్పష్టమైంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పేరిట అనేక మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ఉద్ధృతంగా చేపట్టిన ప్రక్రియను ప్రతిపక్షాలు మాత్రమే కాదు, సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది. మొత్తం ఎస్ఐఆర్‌నే నిలిపివేస్తాం జాగ్రత్త అని సుప్రీంకోర్టు సోమవారం హెచ్చరించింది.
ఎస్ఐఆర్‌ను వివాదరహితంగా నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైంది. ఓట్ల చోరీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కమిషన్ వద్ద స్పష్టమైన సమాధానాలు లేవు. నిజానికి ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువ చేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితి నుంచి బీజేపీని కాపాడాల్సిన బాధ్యతను మోదీయే పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. అక్రమ వలసదారుల వల్ల బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రజలు తమ కూతుళ్లు, చెల్లెళ్ల భద్రత పట్ల ఆందోళనతో ఉన్నారని మోదీ ప్రకటించారు. అంటే అక్రమంగా వలసవచ్చిన వారు ఈ రాష్ట్రాల్లో చాలా అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన సారాంశం. పైగా ఇలాంటి వారిని కాపాడేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, యాత్రలు కూడా చేస్తున్నాయని మోదీ ఆరోపించారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రను ఉద్దేశంలో ఉంచుకునే ఆయన ఈ విమర్శలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.
ఉత్తరాదిన అత్యంత కీలక ప్రభావం చూపే బిహార్‌లో మాత్రం బీజేపీ గత కొన్ని దశాబ్దాలుగా విశ్వయత్నాలు చేస్తున్నప్పటికీ స్వంతంగా అధికారంలోకి రాలేని స్థితి ఉన్నది. మండల్ రాజకీయాలు ప్రవేశించిన తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్ ఆవిర్భావంతో ఓబీసీలు, మైనారిటీలు సంఘటితమయ్యారు. 1995లో జార్జి ఫెర్నాండెజ్, నితీశ్‌కుమార్‌తో కలిసి లాలూతో వేరుపడ్డ తర్వాత కూడా 2005 వరకు లాలూ ఆధిపత్యాన్ని తగ్గించలేకపోయారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో, 2000లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫెర్నాండెజ్, నితీశ్‌కుమార్‌లు ఇద్దరూ బీజేపీతో చేతులు కలిపారు. అప్పటికి లాలూ పశు గ్రాసం కుంభకోణంలో చిక్కుకుని తన భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేయాల్సి వచ్చింది. 2000లో నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి అయినప్పటికీ మెజారిటీ నిరూపించుకోలేకపోవడంతో మళ్లీ రబ్రీదేవి ముఖ్యమంత్రి అయి 2005 వరకు అధికారంలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్డీఏలో నితీశ్‌కుమార్ తిరుగులేని నాయకుడయ్యారు. 2010లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీ(యు) 115 సీట్లు సాధించగా, బీజేపీ 91 సీట్లు సాధించింది.
కానీ బీజేపీలో క్రమక్రమంగా ఒక ప్రత్యామ్నాయ నాయకుడుగా నరేంద్రమోదీ అవతరిస్తున్న క్రమంలో నితీశ్‌కుమార్ మొదట్లో ఆయనను సరిగా అంచనా వేయలేకపోయారు. 2005, 2010లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూనే బీజేపీకి దేశమంతా స్టార్ క్యాంపెనియర్‌గా అవతరిస్తున్నప్పుడు నితీశ్ ఆయనను విస్మరించారు. 2010లో ఘన విజయం తర్వాత ఆయనలో జాతీయ స్థాయిలో ఆకాంక్షను రేకెత్తించింది. మోదీని వ్యతిరేకిస్తే లాలూ ముస్లిం ఓట్ బ్యాంకును కూడా ఆకట్టుకోగలననుకున్నాడు. తొలుత బిహార్‌లో మోదీని ప్రచారానికి పంపవద్దని బీజేపీ నాయకత్వాన్ని అడ్డుకున్న నితీశ్‌కుమార్... మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో ఎన్డీఏ నుంచి తప్పుకున్నాడు. కానీ 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభంజనంలో బిహార్‌లో బీజేపీకి 22 సీట్లు రాగా 40 సీట్లకు పోటీ చేసిన జేడీ(యు) 2 సీట్లకు పరిమితమైంది. దీనితో 2015లో అతడు మళ్లీ లాలూతో చేతులు కలిపి ముఖ్యమంత్రి పదవికోసం రాజీపడాల్సి వచ్చింది.ఒకప్పుడు నితీశ్‌కుమార్ తనను తీవ్రంగా వ్యతిరేకించి, తనను రాష్ట్రంలో అడుగుపెట్టనీయకుండా చేసినప్పటికీ అతడినే చేరదీసి బిహార్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయగలగడం మోదీ ప్రత్యేకత. నిజానికి జేడీ(యు)%-%ఆర్‌జేడీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మోదీ ఢిల్లీ నుంచి కొన్ని వ్యూహాత్మక చర్యలు తీసుకున్నారు. మాఫియా డాన్,

## తెలంగాణ అంటేనే త్యాగాల అడ్డా..

# పోరాటాల గడ్డ

మొదటిపేజీ తరువాయి
వారందరికి బీఆర్ఎస్ తరపున, కేసీఆర్, ప్రతి గులాబీ సైనికుడి తరపున వారి అమరత్వానికి శిరసు వంచి వినమ్రంగా నివాళులర్పిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. సాయుధ పోరాటం నుంచి మొదలుపెడితే తొలి దశ తెలంగాణ ఉద్యమమైనా, ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన మలిదశ పోరాటమైనా, ఇవాల్టికి కూడా ఈ నియంతృత్వ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటమైనా.. వీటన్నింటికి బీజం పడ్డది తెలంగాణ సాయుధ పోరాటంతోనే. ఒక షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, ఆరుట్ల కమలమ్మ, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి ఎంతో మంది పెద్దలు ఆనాడు పోరాట స్ఫూర్తితో బండెనక బండికట్టి అని అద్భుతమైన కవితలు రాశారు. ఆ పెద్దల స్ఫూర్తితో, మరి భవిష్యత్‌లో కూడా ప్రజాస్వామిక ఉద్యమాలు నిర్మిస్తూ తెలంగాణలో తిరిగి సంక్షేమ రాజ్యం రావాలని, రైతు రాజ్యం రావాలని, తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునే, నియంతృత్వ పోకడలు లేని ప్రజాస్వామ్య వాతావరణం రావాలని ఆశయంతో కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా మా విద్యార్థి తమ్ముళ్లు, చెల్లెళ్లు పోరాడుతున్నారు. ఈ
కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల భర్తీలో విఫలమైంది. ఈ క్రమంలో దిక్కుతోచక రౌండ్ టేబుల్ సమావేశం పెట్టు-కుంటే నియంతృత్వ పోకడలతో విద్యార్థులతో అరెస్టు చేస్తున్న దుర్మార్గమైన వ్యవస్థ మన కళ్ల ముందున్నది. రైతులు ఇవాళ అల్లాడిపోతుంటే వారిని పట్టించుకోకుండా ఒలింపిక్స్ గురించి మాట్లాడుకుంటున్న ఒక నీతిమాలిన ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్నది. ఇలాంటి నియంతృత్వ పోకడలను ఆనాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఎదురిద్దాం. కేసీఆర్ నాయకత్వంలో తిరిగి తెలంగాణను సంక్షేమ బాటలో తీసుకెళ్దాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఒకరు విమోచనం, ఒకరు విలీనం, ఒకరు విద్రోహం అనొచ్చు.. కానీ రాచరిక వ్యవస్థలో నుంచి ప్రజాస్వామిక వ్యవస్థలోకి సమైక్యమైన రోజు కాబట్టి జాతీయ సమైక్యతా దినోత్సవంగా పాటిస్తున్నాం. గతంలో ప్రభుత్వంలో కూడా ఈ విధంగానే పిలిచాం. ఆ రోజు జెండా ఎగురవేశాం.. ఇవాళ కూడా జెండా ఎగురవేశాం. ఆనాటి పోరాట యోధుల త్యాగాల సాక్షిగా తెలంగాణ బిడ్డలు మరోసారి పోరాటం చేయవలసిన అవసరం ఉన్నది అని కేటీఆర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కెఇఆర్ సురేశ్ రెడ్డి, మధుసూధనాయారి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ తదితర పలువురు నేతలు పాల్గొన్నారు.

# ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనది



మొదటిపేజీ తరువాయి
**హైదరాబాద్,సెప్టెంబర్17 :**
**ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పోరాటం మనది. సాయుధ పోరాటస్ఫూర్తితో నిన్నటి నియంత పాలనను పక్కనపెట్టాం అని అన్నారు. పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావులేదు. స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయంలో రోల్‌మోడల్‌గా ఉన్నాం. ఉన్నత చదువుల ద్వారా మన యువత సత్తా చాటాలి. భవిష్యత్తులో పాఠశాలల రూపురేఖలు మారబోతున్నాయి. విద్యతో పాటు- క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరలో రాష్ట్ర విద్యా విధానం తెస్తున్నాం అని అన్నారు. సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిది. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి సత్తాచాటారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు ఏర్పాటు చేస్తాం. రైతుల కోసం తెచ్చే పథకాలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయని అన్నారు. ఏ రాష్ట్రం చేయని విధంగా వారికి మేలు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదు. సాగు మోటార్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహించి వేగంగా ఫలితాలు వెల్లడించాం. సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం.**
గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. మా ప్రభుత్వం వచ్చాక భూభారతి చట్టం తెచ్చి సమర్థంగా అమలు చేస్తున్నాం. పేదల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం. 904 టీఎంసీల సాధనకుట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపిస్తాం. కృష్ణా జలాల హక్కుల కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తాం. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేసేది లేదన్నారు. హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. ఈ నగరాన్ని గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి మన రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలి. హైదరాబాద్‌కు గోదావరి జలాలు తీసుకొస్తున్నాం. కాలుష్యం లేని నగరంగా మారుస్తున్నాం. మూసీ నది పక్కన జీవించే పేదలకు మంచి జీవన ప్రమాణాలు కల్పిస్తాం. ఈ
పరిధిలో ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పర్యాటకులను ఆకర్షించేలా మూసీ నదిని మారుస్తాం. ఈ ఏడాది డిసెంబర్ 9 లోగా అనేక అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం అని అన్నారు. త్వరలోనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభిస్తాం. తెలంగాణ అంటేనే పోరాటాలు, త్యాగాలకు వేదిక. యువత పాలిట శాపంగా మారిన డ్రగ్స్ సమస్యను అరికడతాం. మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి. వీటిని అరికట్టడంలో మన పోలీసులు సత్తా చాటారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నాం. డిసెంబర్ 9న రాష్ట్ర ప్రజలకు దీన్ని అందిస్తాం. దేశానికి గొప్ప నగరం నిర్మించాలనే ఉద్దేశంతో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ తెస్తున్నాం. దీంతో రాష్ట్ర ఆదాయం బాగా పెరుగుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు కూడా అభివృద్ధి సూచిక కానుంది. 12 రేడియల్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది 1948, సెప్టెంబర్ 17... ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛాపతాకను ఎగుర వేసిన రోజు.. ఈ గడ్డపై రాచరికానికి గోరీ కట్టి... ప్రజా పాలనకు హారతి పట్టిన రోజు సెప్టెంబర్ 17.. అందుకే ఇది ప్రజా పాలన దినోత్సవం.. రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వేచ్ఛ మన జీవన విధానం.. ఆ స్వేచ్ఛా సాధనకు ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని జాతి మనది.. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను.. సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి.. అదే విధంగా డిసెంబర్ 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరోమైలు రాయి.. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మొదలైన స్వరాష్ట్ర ప్రస్థానం తిరిగి మళ్లీ నియంతృత్వ నిర్బంధంలోకి జారి పోయిన తీరు గడచిన పదేళ్లలో మనం చూశాం.. నాటి సాయుధ పోరాట స్ఫూర్తితో నిన్నటి నియంతృత్వ పాలనను ఓడించి, ప్రజా పాలనను తెచ్చుకున్నాం అని అన్నారు. 77 ఏళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, పోరాట చరిత్రను, ఇక్కడ ఉద్భవించిన ఉద్యమాల సరళిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని మేం ఈ రోజు పరిపాలన చేస్తున్నాం.. అహంకారపు ఆలోచనలు, బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావు లేదు.. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో పంచుకుంటున్నాం. ప్రజల ఆకాంక్షలు, వారి ఆలోచననే ప్రమాణికంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం.. తీసుకున్న నిర్ణయాలలో మంచి చెడులను విశ్లేషించే అవకాశం ఇస్తున్నాం.. తప్పులుంటే దిద్దుకుంటు-న్నాం. మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నాం అని సిఎం రేవంత్ వివరించారు. అలాగే అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ- పడాలన్న తపనతో పని చేస్తున్నాం.. ప్రతి పేదవాడి మొఖంలో ఆనందమే లక్ష్యంగా సంక్షేమ చరిత్రను తిరగ రాస్తున్నాం.. ఏడు దశాబ్ధాలుగా తెలంగాణ ఆశిస్తోన్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే మా ప్రభుత్వ ప్రథామిక ఎజెండా.. అభివృద్ధిలోనే కాదు... స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం విషయంలో కూడా తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా ఉంటు-ంది.. విద్యనే మన విజయానికి వజ్రాయుధం అని మేం నమ్ముతున్నాం.. గొప్ప విజన్ తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల ఆలోచన చేశాం.. భవిష్యత్ లో తెలంగాణ విద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఈ స్కూళ్లు కేంద్రాలుగా మారబోతున్నాయి.. విద్యపై మేం చేస్తున్న వ్యయం ఖర్చు కాదు.. భవిష్యత్ తెలంగాణకు పెట్టుబడిగా మేం భావిస్తున్నామని అన్నారు. విద్యతో పాటు- క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇన్నోవేషన్ కు పెద్దపీట వేస్తున్నాం.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ-, తెలంగాణ రైజింగ్ 2047 రాష్ట్రాన్ని సగర్వంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంతకుముందు అమరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

# మరింత ఉత్సాహంతో పనిచేస్తా..

## 'జనశక్తి'కి కృతజ్ఞతలు: ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి
"దేశవిదేశాల నుంచి అందిన శుభాకాంక్షలు, ఆశీర్వాదాలు, ఆప్యాయతతో కూడిన సందేశాలతో ఉప్పొంగిపోయాను. ఈ అనురాగం ఎంతో ప్రేరణగా నిలుస్తోంది. కేవలం నా ఒక్కడికే కాకుండా.. మెరుగైన భారత నిర్మాణం కోసం మనమంతా కలిసి చేస్తున్న పనులకు దీవెనగా భావిస్తున్నాను. మరోవైపు.. దేశవ్యాప్తంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవాసుల్లో అంతర్లీనంగా ఉన్న ఈ మంచితనమే సమాజాన్ని నిలబెడుతోంది. సానుకూల దృక్పథం, ఆశావాదంతో అన్ని సవాళ్లను అధిగమించేందుకు ధైర్యాన్ని అందిస్తోంది. 'వికసిత్ భారత్' కలను సాకారం చేసేందుకు మరింత శక్తి, అంకితభావంతో పనిచేయాలని నిశ్చయించుకున్నాను. అందరికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని మోదీ (%ఛీఖతీవఅఎతీఖ వీశీఎఱ%) పేర్కొన్నారు.
నమో నమో ఆర్త బాంధవుడా.. మోదీ బర్త్‌డే స్పెషల్ సాంగ్
జన్మదినం పురస్కరించుకుని ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ సహా వివిధ దేశాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, సినీ నటులు, వివిధ రంగాల ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టారు. ఆయా రాష్ట్రాల్లో పెద్దఎత్తున సేవా కార్యక్రమాల నిర్వహణతోపాటు వివిధ పథకాలకు శ్రీకారం చుట్టారు.

# పటేల్ చొరవతో

# హైదరాబాద్‌కు విముక్తి

మొదటిపేజీ తరువాయి
ఈ రోజు సెప్టెంబర్ 17. ఇది మరో చరిత్రాత్మకమైన రోజు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం అని మోదీ అన్నారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని కొనియాడారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. ఇది నవభారతం. ఎవరికీ భయపడదు. శత్రువుల భూభాగంలోకి వెళ్లి వారిని మన బలగాలు మట్టుపెట్టాయి. అణుబెదిరింపులకు తలొగ్గదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ అణు బెదిరింపులపై మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ తో భారత్ గట్టి బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించిన సంగతి తెలిసిందే. భారత్ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను వెల్లడించాడు. పాకిస్థాన్ బుద్ధిని వారు బయటపెట్టారంటూ దీనిని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యలు చేశారు. పుట్టిన రోజున మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తోన్న ప్రధాని మోదీ.. స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ పథకాలను తీసుకొచ్చారు.

# విద్యావిధానంలో

# సమూల మార్పులు

మొదటిపేజీ తరువాయి
ఏటా లక్షా 10 వేల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు వస్తున్నారని, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లతో 15 శాతం మందికే ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. విద్యాశాఖ కు రూ. 21 వేల కోట్లు- కేటాయిస్తే.. 98 శాతం జీతాలకే పోతోందని, విద్యా విధానంలో మార్పులు తీసుకురావడమే తన ధ్యేయం అని పేర్కొన్నారు. 73 లక్షల మంది యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నదే తన లక్ష్యం అని దేశ విద్యా విధానాన్ని మార్చేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని అధికారులకు సూచించారు. పాఠశాల విద్యలో లోపాలున్నాయని, విద్యా అంశంలో రాజకీయ ఇబ్బందులు ఎదుర్కోవడానికి సిద్ధం అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సమీక్షలో కె. కేశవరావు, ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన వారిపై నిందలు అన్యాయం- మంత్రి శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్:
పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం త్వరలో ముగిసిపోతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రజా పాలన వేడుకల్లో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం స్పీకర్ పరిధిలో ఉందన్నారు. అఫిడవిట్లలో ఎమ్మెల్యేలు అన్ని విషయాలూ వెల్లడించారని చెప్పారు. టీజీపీఎస్సీ చిత్తశుద్ధితో ముందుకెళ్తోందన్న ఆయన.. గ్రూప్ 1 పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని పునరుద్ఘాటించారు. ఉద్యోగాలు సాధించిన ప్రతిభావంతులపై నిందలు వేయడం అన్యాయమన్నారు.

## అమరుల ఆశయాలను కొనసాగిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి
ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ లో జాతీయ జెండాను పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం బైరాన్ పల్లి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 1948 ఆగస్టు 27న వందలాది మంది అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు, తెలంగాణ అమరవీరులకు జోహార్లు అని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రజా పాలన దినోత్సవం గా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, సిపి అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీనం సందర్భంగా సిద్దిపేట జిల్లా వీర బైరాన్ పల్లి అమరవీరుల స్థూపం, చారిత్రాత్మక బురుజు వద్ద ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పూజల హరికృష్ణ, ఇతర ముఖ్య నేతలతో కలిసి అమరవీరులకు నివాళులర్పించడం జరిగింది.

## తెలంగాణ విమోచన దినోత్సవం

**- బీజేపీ నాయకుల కార్యక్రమం**



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ లోని గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బీజేపీ నాయకులు విక్రమ్ రెడ్డి జండా ఆవిష్కరణ చేసి, తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 ఒక కీలకమైన రోజు అని, శతాబ్దాల బానిస సంకెళ్లను తెంచుకున్న క్షణం అని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడాది అయినా, తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోసం ఎదురుచూసిన పోరాటం ఫలించిన రోజు ఇది అని ఆయన పేర్కొన్నారు.

## బోడుప్పల్ డ్రైనేజీ సమస్య పరిష్కారం,

**- కాలనీ వాసుల కృతజ్ఞతలు**




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ రాజేష్‌నగర్ కాలనీలో మూడు రోజులుగా పేరుకుపోయిన డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. మురుగు నీరు రోడ్లపైకి పొంగి, దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాసాల కుమార్ యాదవ్ సమాచారం అందుకుని, మంగళవారం ఉదయం పర్యటించి, మున్సిపల్ సిబ్బందితో కలిసి మలినాలను తొలగింపజేశారు. దీంతో కాలనీలో పరిశుభ్రత పునరుద్ధరించబడింది. కాలనీ వాసులు రాసాల కుమార్ యాదవ్ వేగవంతమైన స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు.

## మూలరాంపుర్ లో పురగిరి క్షత్రియ సంఘం



**- కండువాల పండుగ**

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మూలరాంపుర్ గ్రామంలో బుధవారం పురగిరి క్షత్రియ (పెఱక) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కండువాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు స్నేహాన్ని మరింత బలపరుచుకునేందుకు ఒకరి మెడలో ఒకరు కండువాలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రాకేష్ తో పాటు పలువురు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## గోధూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామాపూర్, పక్కిర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపుర్, మూలరాంపూర్, ఎర్దండి, కోమటి కొండాపూర్, వర్షకొండ, డబ్బా, అమ్మకపెట్, ఎర్రపూర్, ఇబ్రహీంపట్నం, కేశాపూర్, కోజన్ కొత్తూరు గ్రామాలలో బుధవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వచ్ఛహిత సేవా కార్యక్రమాల సమావేశం నిర్వహించారు.

## రేగుంట కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని 13వ వార్డు రేగుంట కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కమిషనర్ టి. మోహన్‌కు వినతి పత్రం అందించారు. మెట్ పల్లి నుండి రేగుంటకు వెళ్లే దారిలో ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించి, గుంతలు పూడ్చి దారికి మరమ్మతులు చేయాలని వారు కోరారు. ఈ చెట్ల వల్ల పట్టణానికి వచ్చే వార్డు ప్రజలకు, పాఠశాలకు వెళ్లే పిల్లలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# అమరుల త్యాగాల ఫలితమే సెప్టెంబర్ 17న తెలంగాణా విముక్తి..

**- రైతు ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ..**



ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా నిజాం నిరంకుశ, రజాకార్ల అరాచకత్వ కబంధ హస్తాల నుంచి తెలంగాణ ప్రాంతానికి 1948 , సెప్టెంబర్ 17 న విముక్తి లభించి స్వేచ్చా స్వాతంత్ర్యం సిద్దించిందని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు.బుధవారం కరీంనగర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విముక్తి దినోత్సవ సమావేశంలో పోలాడి రామారావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు.బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుంచి దేశానికి 1947, ఆగస్ట్ 15 న స్వాతంత్ర్య సిద్దించగా, దేశ హెూమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదేశాల మేరకు సైనిక చర్య తో నిజాం అనే పిశాచ పీడ విరుగడైన రోజు, ఎంతోమంది అమర వీరుల ఆత్మ ఆనంద తాండవ రోజైన సెప్టెంబర్ 17,1948 లో తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించి స్వేచ్చా స్వాతంత్ర్యం సుద్దించిందని రామారావు అన్నారు. అప్పట్లో నిజాం పాలనలో రజాకార్ల దురాగతాలను వివరిస్తూ పన్ను చెల్లించని వారి గోర్లు ఊడగొట్టి, ఇళ్లల్లో రజాకార్ల ముష్కర్లు చొరబడి భర్తల కళ్లెదుటే భార్యల పై అత్యాచారాలు చేసే వారని,మహిళలను వివస్త్రలను చేసి నగ్నంగా ఉంచి బతుకమ్మలను ఆడించే వారని, భార్యల ముందే భర్తలను పాశవికంగా చంపి అనేక దురాగతాలకు పాల్పడే వారని రైతులను ఊచకోత కోసి కర్కశంగా ప్రవర్తించి ఇళ్లను తగులబెట్టి నిలువ నీడ లేకుండా చేశారని పోలాడి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తో ఎందరో యోధులు నిజంను గడ గడ గడ లాడించి అమరులైన వీరులకు రామారావు జోహార్లు అర్పించారు.ఓటు బ్యాంక్ రాజకీయాలతో పలు రాజకీయ పార్టీలు సెప్టెంబర్ 17 వ రోజును వివిధ పేర్ల తో నిర్వహించడం దారుణమని మండి పడ్డారు.ఇది అసలైన తెలంగాణ ప్రాంత విముక్త స్వేచ్చా స్వాతంత్ర్య దినోత్సవ రోజని రామారావు అభిప్రాయ పడ్డారు. సైనిక చర్య తో నిజాం మెడలు వంచిన అప్పటి హెూం మంత్రి కీ.శే.సర్దార్ వల్లభాయ్ పటేల్ కు తెలంగాణా జాతి రుణపడి ఉంటుందని తెలుపుతూ ప్రజా సంఘాల సమాఖ్య తరపున భారత ప్రధాని నరేంద్ర మోడి కి 75 వ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పోలాడి రామారావు ప్రకటించారు.

# సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛత హి సేవ మెగా ర్యాలీ.. కొనసాగుతాయి





**- యువత భాగస్వామ్యం కావాలి..**
**- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 17**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వచ్ఛత హీ సేవ మెగా ర్యాలీని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ఈ నెల 17 నేటి నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను, ప్రజా సంఘాలను, భాగస్వామ్యం చేస్తూ పురాతన ఇనోవేటివ్ దేవాలయాలను, స్థలాలను క్లీన్ చేస్తామని ఇందుకు అందరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛత హీ సేవ కార్యక్రమానికి ప్రజలు, యువకులు ప్రతి ఒక్కరు భాగస్వాములు అయి జమ్మికుంట మున్సిపాలిటీని క్లీన్ సిటీగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్, మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్ స్పెక్టర్ సదానందం, ఈఈ శ్రీకాంత్ లతో పాటు మెప్మా ఆర్పిలు, పారిశుధ్య కార్మికులు, సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

# మోదీ జన్మదిన సందర్భంగా 200 మంది యువకుల రక్తదానం

**- అభినందించిన బిజెపి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చెన్నమనేని వికాస్**
**- హాజరైన జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 200 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరయ్యారు. అనంతరం వికాస్ రావు మాట్లాడుతూ మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా సేవాపక్షం అనే కార్యక్రమాన్ని తీసుకొని దేశవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశ ప్రధాని జన్మదిన ఉత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా రక్తదానంలో పాల్గొన్న 200 మంది యువకులను వికాస్ రావు ప్రత్యేకంగా అభినందించి మేమేంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్, రూరల్ అధ్యక్షుడు బూర పరమేష్, చందుర్తి మండలాధ్యక్షుడు మొకిలే విజేందర్ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, బండ మల్లేశం యాదవ్, రేగుల రాజ్ కుమార్, రేగుల సంతోష్ బాబు, పిన్నింటి హనుమాన్లు, పల్లం అన్నపూర్ణ, కట్కమ్ శ్రీనివాస్, అన్నం నర్సయ్య వివిధ మండలాల బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కథలాపూర్ లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కథలాపూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో మల్లాపూర్ లో తెలంగాణ విమోచన దినోత్సవం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
తెలంగాణ విమోచన దినోత్సవం మరియు భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మల్లాపూర్ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు శాంతక్క, మండల కిషన్ మోర్చా అధ్యక్షులు కుర్మ రాజారెడ్డి పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 18 2025

# తెలంగాణ విమోచన అమరులకు నివాళులు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**




తెలంగాణ విమోచన సంగ్రామంలో అసువులు బాసిన అమరవీరులకు వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం కళాకారులు పూలతో నివాళులు అర్పించి, వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు నిజాం పాలన నుండి విముక్తి పొంది స్వాతంత్ర్యం పొందారని,ఈ స్వేచ్ఛా సంగ్రామంలో అనేకమంది వీరులు తమ ప్రాణాలు త్యాగం చేశారని, వారి త్యాగాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు, కళాకారులు ముడికే తిరుపతి, మత్త కనుకయ్య, ఎర్రం దేవయ్య, మామిండ్ల సత్తయ్య, కళాకారులు పాల్గొన్నారు

# సకల సృష్టికి మూలకారకుడు విరాట్ విశ్వకర్మ

- విశ్వకర్మ జయంతిని జరుపుకోవడం ఆనందదాయకం
-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



సకల సృష్టికి మూలకారకుడు విరాట్ విశ్వకర్మ అని, ఆయన జయంతిని జరుపుకోవడం ఆనందదాయకమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని భగవంతురావు నగర్ లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతిలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడి ద్వారానే ఇనుము, కర్ర, ఇత్తడి, రాతి, బంగారు,వెండి వృత్తులు పుట్టుకొచ్చినట్లు పురాణాలు చెబుతున్నాయని, విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మణులు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కార్మిక లోకం జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద మంజూరైన 6 లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, పుల్కం రాజు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చందనం శ్రీనివాస్, చందనం సత్యనారాయణ, చందనం శివ, నరేందర్ తదితరులున్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం





ఈరోజు మన దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ. జన్మదిన సందర్భంగా ఈరోజు సంగారెడ్డి జిల్లా హత్నూర మండల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ సంఘసాని సురేష్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్ అసెంబ్లీ కన్వీనర్ రమణారావు గారు, మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్ గారు, మాజీ కౌన్సిలర్ ఎరుకల యాదగిరి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత రెడ్డి , ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్ గౌడ్ అసెంబ్లీ కో కన్వీనర్ సతీష్ యాదవ్ హత్నూర మండల అధ్యక్షులు నాగప్రభు గౌడ్ ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు మహేష్ ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ , చంద్ర గౌడ్ నర్సాపూర్ మండల అధ్యక్షులు నాగేష్ హత్నూర మండల బిజెపి సీనియర్ నాయకులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రసాదుకు ఆర్థిక సహాయాన్ని అందించిన తోటి స్నేహితులు



**కరపత్రం ప్రతినిధిహుజురాబాద్:** హుజురాబాద్ కు చెందిన పూర్వ విద్యార్థులు 1987-88 ఎస్ఎస్సి హైస్కూల్ లో చదువుకున్న మిత్రుడు చనుమల్ల ప్రసాద్ గత 12 సంవత్సరాలనుండి మూత్ర నాళల ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న ప్రసాద్ ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఎదులాపురం మిత్ర సేవ సమితి (1987-88 ఎస్ఎస్సి బ్యాచ్ ) ప్రభుత్వ హైస్కూల్ హుజురాబాద్ పూర్వ విద్యార్థులు కలిసి ప్రసాద్ కు వైద్య ఖర్చుల కింద 35,500.రూపాయలను నగదుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. గతములో కూడా ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది తోచిన విదంగా సహాయాన్ని అందించిన మిత్రులకు ప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు చెప్పారు సేవ సమితి అధ్యక్షులు కందుల శ్రీనివాస్ రెడ్డి,కార్యదర్శి గంగిశెట్టి రవీందర్, కోశాధికారి జెల్ల రాంబాబు, పాల కిషన్ మాజీ కౌన్సిలర్, ప్రసాద్, ప్రతాప సతీష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ప్రభుత్వం సరసమైన ధరలకే లబ్దిదారులకు ఇసుకను అందించడం జరుగుతుందని కార్మిక శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామి అన్నారు.






**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీజీఎండీసీ ఆధ్వర్యంలో నర్సాపూర్ మండలం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్ను బుధవారం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు.. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో శాండ్ బజార్, వైకుంఠధామ ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు .ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు కేవలం నల్గొండ నుంచి వస్తున్న ఇసుకకు ఒక్క మెట్రిక్ టన్నుకు రవాణా చార్జి కింద 1200 చెల్లించి గ్రామ కార్యదర్శి ద్వారా టోకెన్ తీసుకొని వస్తే ఇసుకను ఇవ్వడం జరుగుతుందన్నారు.. ఇసుక మాఫియాను తొలగించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్యేయమని ఆయన తెలిపారు. మెదక్ జిల్లాకు పదివేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని ప్రస్తుతం 32, 40 శాతం ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు గతంలో పుస్తెలు మెట్టెలు పెట్టి వైద్యం చేయించుకునే వారని కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చిన తర్వాత 10 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 27 వేల మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య చికిత్సలు చేయించుకున్నారని ఆయన తెలిపారు .అందుకోసం 900 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 800 లక్షల కోట్లు అప్పులు చేసి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడకుండా మంచి పరిపాలన అందిస్తున్నారన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెదక్ జిల్లాకు 20వేల కొత్త రేషన్ కార్డులు రాష్ట్రానికి 17 లక్షల కొత్త రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. నిరుపేదలకు మూడు పూటలా సన్న బియ్యంతో అన్నం తినాలనే ఉద్దేశంతో 12 వేల కోట్లు ఖర్చు చేసి సన్న బియ్యం అందించడం జరుగుతుందన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధికి ఎక్కువ నిధులు వచ్చేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికోసం ప్రభుత్వం జిల్లా, నియోజకవర్గ స్థాయిలో శాండ్ బజారులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులు రవాణా ఖర్చు కింద 1200 చెల్లించి పంచాయతీ కార్యదర్శి ద్వారా టోకెన్ తీసుకువస్తే శాండ్ బజార్ లో మెట్రిక్ టన్ను చెప్పున ఇసుకను తీసుకెళ్లాలన్నారు . ఇసుక నల్గొండ నుంచి రావడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం నర్సాపూర్ శాండ్ బజార్.లో 1100 మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని తెలిపారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో ప్రభుత్వం తరఫున నిర్మించిన మాడల్ ఇందిరమ్మ ఇల్లును మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ నాగేష్ ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, ఆర్డిఓ మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్, టిఎస్ఎండిసి ప్రాజెక్ట్ డైరెక్టర్ సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# జంక్ ఫుడ్ పైననే నేటి యువత మోజు

- హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏ ఎస్ ఎస్ శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి-హైదరాబాద్:**
కార్పొరేట్ కల్చర్ పని ప్రభావంతో మనిషి ఆహారపు అలవాట్లు రోజురోజుకు మారిపోతున్నాయని, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏఎస్ వాపోయారు. మంగళవారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పౌష్టికాహారం నాణ్యత అనే విషయాలు గాలికి వదిలి వేస్తున్నారని కేవలం రుచికి ప్రాధాన్యత ఇస్తూ జంక్ ఫుడ్ వైపు మళ్లుతున్నారని కూల్డ్రింక్స్ మాంసాహారం ప్రాసెస్ ఫుడ్ ను తీసుకుంటున్నారని వీటి మీదనే ఎక్కువగా ఖర్చు చేస్తున్నారని అన్నారు అయితే శరీరానికి అవసరమైన తృణధాన్యాలను తీసుకోవడంలో మాత్రం అనాసక్తితో ఉంటున్నారని గ్రామీణ పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా దేశమంతటా ఇదే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు అయితే ఈ ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి చేటు తెస్తాయని వైద్యులు ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్న యువత పట్టించుకోవడంలేదని అన్నారు.

దేశంలో ప్రజలకు జంక్ ఫుడ్ ని ఎక్కువగా ఇష్టపడుతున్నారని ఈ ఆహారం పైననే ఎక్కువ ఖర్చు చేస్తున్నారని శరీరానికి కావలసిన బలాన్ని ఇచ్చేతులను ధాన్యాలను మాత్రం ప్రజలు అంతగా ఇష్టపడడం లేదని అన్నారు. వారు తీసుకునే ఆహారంలో తృణధాన్యాలకు తగిన స్థానం దక్కడం లేదని గత కొన్ని నీళ్లుగా వీటి వినియోగం చాలా తగ్గిపోయిందని ఆహార ధాన్యాలపై ఖర్చులను తగ్గించి ప్రజలు ప్రాసెస్ ఫుడ్ శీతల పానీయాలు మాంసం ఉత్పత్తులపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నారని అన్నారు ఈ ట్రెండు పట్టణ గ్రామీణ ప్రాంతాలలోనూ కనిపిస్తుందని గ్రామీణ ప్రాంతాలలో 1993- 94 లో ఆహార ధాన్యాలపై చేసిన ఖర్చు 63.2% ఉండగా 2023- 24 నాటికి 46.4 శాతానికి పడిపోయిందని పట్టణ ప్రాంతాలలో ఇది 54.7 శాతం నుంచి39.7 శాతానికి తగ్గిందని ఇక ప్రత్యేకించి తృణధాన్యాలపై చేసే ఖర్చు గ్రామీణ ప్రాంతాలలో24.2 శాతం నుంచి గణనీయంగా ఐదు శాతానికి పడిపోయిందని పట్టణ ప్రాంతాలలో ఇది 14 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గిందని బదులుగా శీతల పానీయాలు ప్రాసెస్ ఫుడ్ మాంసాహారం పై నెలవారీ సగటు వ్యయం( ఎంపీసీఈ) పట్టణ గ్రామీణ ప్రాంతాలలో పెరుగుతుందని అన్నారు తృణధాన్యాలు పప్పులు కూరగాయలు ఎడిబుల్ ఆయిల్స్ పాలపై ఎంపీసీ ఈ తగ్గుదల చూసిందని కేంద్రంలో మోడీ సర్కార్ కార్పొరేట్ల ప్రయోజనాలతో పోలిస్తే వ్యవసాయ రంగంపై చాలా చిన్నచూపు చూస్తుందని అన్నారు. ఈ రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని దీనితో దేశవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దేశంలో చాలామంది ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం కావడంతో ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకున్నా సహజంగానే కొన్ని పంటల ఉత్పత్తులు పెరుగుతున్నాయని ఇందులో ఆహార ధాన్యాలు ఒకటి అని చెప్పవచ్చు అన్నారు. పలు గణాంకాలు ఇదే విషయాన్ని చెబుతున్నాయని మరో పక్క దేశంలో కొన్ని కీలక ఆహార ధాన్యాల తలసరి వినియోగం పడిపోయిందని వీటిని తీసుకునే విషయంలో ప్రజలు ఆసక్తిని కనబడతడం లేదని ఇలా ఉత్పత్తి ఎక్కువ వినిమయం తక్కువ కావడంతో పంట పండించిన రైతుల పైన ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని విశ్లేషకులు చెబుతున్నారని అన్నారు. అలాగే తృణధాన్యాల వినియోగం తగ్గడంతో సమతుల్య పోషకాహారం విషయంలోనూ భారత్ పలు సవాళ్లు ఎదుర్కొంటుందని హెచ్చరించారు.

**ఆహార ధాన్యాల ఉత్పత్తి లభ్యత..**

భారత్ లో 1993- 94 నుంచి 2023 -24 మధ్య ఆహార ధాన్యాల ఉత్పత్తి స్థిరంగా పెరిగిందని సాగు122.8 మిలియన్132.1 హెక్టార్లకు పెరుగుదలను సూచించిందని ఫలితంగా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 184.3 మిలియన్ టన్నుల నుంచి332.3 మిలియన్ టన్నులకు పెరిగిందని నెలవారి తలసరి ఆహార ధాన్యాల లభ్యత దేశంలో పెరిగిందని అన్నారు ఇది 1993లో 14.1 కిలో గ్రాములు గా ఉంటే 20 23 నాటికి 17.3 కేజీలకు పెరిగిందని ఈ సమయంలో సాధారణంగానే తృణధాన్యాల లభ్యత కూడా పెరిగిందని అన్నారు.

**రాష్ట్రాల వారీగా ఇలా...**

పశ్చిమబెంగాల్ ఒరిస్సా బీహార్ జారండ్లలో తృణధాన్యాల వినియోగం రేటు అధికంగా ఉందని, పంజాబ్ హర్యానా కేరళ ఢిల్లీ వంటి రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు (యూటీ ) లో తక్కువగా ఉందని పప్పు ధాన్యాల వినియోగం గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాలలో అధికంగా ఉందని ఈశాన్య రాష్ట్రాలలో వీటి వినియోగంలో హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్లోని గ్రామీణ పట్టణ ప్రాంతాల ప్రజలు ముందున్నారని పేర్కొన్నారు.

# జమ్మికుంట పట్టణంలో సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 17**
జమ్మికుంట పట్టణంలో సాయి మానసిక వికలాంగుల పాఠశాలలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదిన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బిజెపి మండల నాయకులు గాదే మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట మాజీ సర్పంచ్ సురేందర్ రాజ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని ప్రపంచంలో అన్ని రంగాలలో మొదటి స్థానంలో తీసుకురావడంలో అశ్లేష కృషి చేశారని వారు కొనియాడారు. ప్రపంచ గురువుగా దేశ ఔన్నత్యాన్ని దేశ సమగ్రతను కాపాడడంలో తనదైన ముద్రను, నాయకత్వ లక్ష్యాన్ని పునికి పుచ్చుకొని భారతదేశాన్ని శత్రుదేశాల కాపాడడంలో నిరంతరం కష్టపడుతూ భారతదేశాన్ని ఆదర్శంగా నిలిచారని వారు కొనియాడారు. గుజరాత్ రాష్ట్రంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మోడీ భారతదేశ ప్రధాని కావడం ఎంతో గర్వకారణంగా ఉందని వారు సంతోషం వ్యక్తం చేశారు. దేశభక్తి పునికి పుచ్చుకొని



ఆర్ఎస్ఎస్ లో కార్యకర్తగా చేరి ఎన్నో ఉన్నత పదవులు అధిరోదించిన మహోన్న నేత అని వారు కొనియాడారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక రంగాన్ని అగ్రరాజ్యాల పోటీకి నిలిపిన పరిపాలన దక్షుడిగా వారు దేశానికి ఎన్నో సేవలు అందించాలని వారు గుర్తు చేశారు.. మోడీ పరిపాలనలో భారతదేశంలో అనేక నూతన సంస్కరణను చేపట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఈటల అభిమానులు,నరేందర్, రాచపల్లి వెంకటేష్,రాములు, నిమ్మల శంకర్ పొట్యాల మల్లేష్, కొమురయ్య రాజు, మధుకర్, ప్రవీణ్, సుధాకర్, కుమార్, సమ్మిరెడ్డి, హబీబ్, శేఖర్, మహేంద్ర చారి, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

24

# వారధి నోటీసులను పట్టించుకోని టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్...!

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట సెప్టెంబర్ 17**



ఇల్లందకుంట :టేకుర్తి మోడల్ స్కూల్ లో నైట్ వాచ్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న గడ్డి కొమురయ్య అనే వ్యక్తి గత మూడు నెలల క్రితం హత్యాయత్నం కేసు పైన జైలుకు వెళ్లి బెయిల్ పై రాగా అటువంటి వ్యక్తిని విధుల్లోకి తీసుకొగా భాధితుడు ఎలవేణి అనిల్ వారధి సెక్రటరీకి అతడిని రిమూవ్ చేయాలనీ పిర్యాదు చేయగా అతన్ని తొలగించడం కోసం గడ్డి కొమురయ్య పై నమోదైన ఎఫ్ ఐ ఆర్ కాఫీ, రిమాండ్ రిపోర్టు పంపించాలని టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐలయ్య ను వారధి సెక్రటరీ నోటీసుల ద్వారా కోరగా నాకు సంబంధం లేదు, నాకు పోలీసు వారు ఇవ్వడం లేదు, అనే విషయాన్ని చెప్పి నిందితుడైన గడ్డి కొమురయ్యకు కొమ్ముకాస్తున్నాడని బాధితుడు ఎలవేణి అనిల్ తెలిపాడు. నైట్ వాచ్మెన్ గా కొమురయ్యను విధుల నుండి తొలగించాలని మోడల్ స్కూల్ ఏ డి ఆఫీస్ హైదరాబాద్, కలెక్టరేట్ ప్రజావాణి, వారధి సెక్రటరీ, ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదని, నిందితుడికి కొమ్ముకాస్తున్న టేకుర్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐలయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.